


## టేకుమళ్ల కామేశ్వరరావు

— (౦) —

తలుపు తాళం వేస్తూవుండగా ఎప్పటి ప్రకారమే మా స్నేహితుడు "కిటికీ తలుపుకూడా వేసెయ్యవోయ్, ఎందుకేనా మంచిది" అన్నాడు. నేనూ ఎప్పటిలాగే నవ్వేసి "పోదూ, నీ చాదస్తం నువ్వూను. రోజురోజూ నీ చాదస్తం ఎక్కువౌతూంది. కిటికీ తీసివుంటే ఎవడేం తీసుకుపోతాడని? కొంకి కర్రకేనా అందేది ఏమీ లేదు. ఎందుకు నీకీ వెర్రి" అన్నాను. అతను వూరుకున్నాడు.


మా స్నేహితుడూ (అతని పేరు రామచంద్రరావు) నేనూ చెన్నపట్టణంలో లా కళాశాలలో ఎఫ్. ఎల్. చదువుతున్నాము. మైలాపూరులో ఒక గది అద్దెకు తీసుకుని బస చేస్తున్నాం.

రామచంద్రరావు చెన్నపట్టణంలో దర్జా దొంగతనాలు చాలా విన్నాడు. నాకూ చాలా చెప్పాడు. అతనిమట్టుకు అతను చాలా జాగ్రత్తగా వుంటాడు. కొత్తవాళ్లని ఎవళ్లనీ గదిలోకి సాధారణంగా రానియ్యడు. ఒకవేళ రానిచ్చాడా ఒకంతటగాని వాళ్లని నమ్మడు. అతని ఈ విపరీతాన్ని చూసి నేను ఎంతోనా నవ్వుకునేవాణ్ణి. అంత చాదస్తమేమిటా అని ఆశ్చర్యం వేసేది నాకు. ఎప్పుడేనా కూకలేస్తూ వుండేవాణ్ణికూడా.

మేము కళాశాలకు వెళ్లేముందు నేను గది తలుపు తాళం వేస్తూవుండేవాణ్ణి. నేను తాళం వేస్తూన్నప్పుడల్లా అతను "ఎందుకేనా మంచిది కిటికీ తలుపుకూడా వేసెయ్యవోయ్" అనేవాడు. అతను అన్నప్పుడల్లా నేను అతని అతి జాగ్రత్తమీద ఒక చిన్న ఉపన్యాసమిచ్చేవాణ్ణి. "అనుభవిస్తావులే" అని అనేసి అతను వూరుకునేవాడు. "చూద్దాంలే" అని నేను అనేవాణ్ణి.

ఒక రోజు శనివారంనాడు పొద్దున్నపూట నేను తెలుగు నవల చదువుతూ కూర్చున్నాను. మా స్నేహితుడు ఇంట్లో లేడు, ఎక్కడికో పనిమీద వెళ్లాడు. ఇంకా నాలుగు పుటలేనా చదవలేదు. ఎవరో ఒక పెద్దమనిషి జోళ్ల చప్పుడు చేస్తూ మెట్లెక్కివచ్చి గుమ్మం ఎదురుగా నిలబడ్డాడు. పుస్తకం మూసేసి చూశాను. అంతా దొరవేషంలో వున్నాడు. "ఎవరు మీ"రని అడిగాను.

"మాది తంజావూరు" అన్నాడు ఆ కొత్తమనిషి.



"ఏం పనిమీద వచ్చారు, ఇక్కడికి" అన్నాను నేను. ఆయన వచ్చీరాని తెలుగులో "ఈవూళ్లో నిండా పనివుంది సార్! ఈ రోజు వుండి పూడుస్తాను. మా వైపు తెలుగువాండ్లు నిండా వున్నారు. నాను తెలుగు మనుపు

బాగా వస్తూవుండింది. ఇప్పుడైనా జాస్తిగానే వస్తుంది. ఇక్కడ సూట్ కేస్‌దా వుంచి మళ్లా సాయింత్రందా వచ్చి పూడుస్తాను. ఏమిసార్!" అన్నాడు. నేను ఒక్కక్షణం ఆలోచించి "అభ్యంతరంలేదు. మీ పెట్టె అక్కడ పెట్టుకోండి" అన్నాను. అప్పుడతను "మీరు నిండా మంచివారు సార్. కొంతమంది శానా పోకిరీలు వుండారు. పళ్లపాడేనా అడిగితే ఇచ్చేది లేదు. శానా చెడ్డవాళ్లు. మీకు నిండా థాంక్స్ సార్!"అని చెప్పి గదిలోకి వచ్చి అతి మర్యాదగా ప్రవర్తించి సూట్ కేస్ ఒక మూల పెట్టాడు. సూట్ కేస్‌కు ఒక పువ్వులగుడ్డ బురకా వుంది: పెట్టె మాసిపోతుందని కావోసు పాపం, జాగ్రత్త! నేను నవల చదువుకుంటూ కూచున్నాను. తంజావూరు మనిషి భోజనం వేళకు తిరిగి వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మరి కొంచెంసేపటికి రామచంద్రరావు వచ్చాడు. వచ్చీ రావడంతోనే అతని కళ్ల పడింది ఆ బురకా సూట్ కేస్. "ఏమోయ్! ఎవరేనా బంధువులు వచ్చేరా ఏమిటి?" అని తొందరగా అడిగాడు. నేనూ పుస్తకం దించి "అబ్బే! బంధువులూ లేదు ఎవరూ లేదు. తంజావూరు నుంచి ఎవరో ఒక బ్రాహ్మడు వచ్చాడు. అతనికి ఈ వూళ్లో ఏదోపని వుందిట. ఆ పని చూసుకు వస్తానని చెప్పి ఇక్కడ తన సూట్‌కేస్ పెట్టి వెళ్లాడు. సాయింత్రం మళ్లీ వాళ్ల వూరు వెళ్లి పోతాడుట"అన్నాను.

"ఎవడో దొంగ వెధవ కాదు కదా!" అన్నాడు అతను.

"అబ్బే!"

"దొంగ వెధవలు కూడా ఇదే వేషం వేసుకు వస్తారులే."

"ఈ మనిషి చాలా మంచివాడులా కనపడుతున్నాడు."

"ఏదయినా జాగ్రత్తగా వుండాలి సుమా. నమ్మకూడదు."

"వాడిచేతికి గది తాళాలు ఇస్తామా యేమిటి, అజాగ్రత్తకి. వాడి పని వాడు చూసుకుంటాడు. మనం చూస్తూ వుండగానే పెట్టె పట్టుకు పోతాడు" అన్నాను నేను.

"మంచిదే" అని అతను వూరుకున్నాడు.

పదిగంటలయింది. తంజావూరు మనిషి వచ్చాడు. రామచంద్రరావు అతన్ని ఎగాదిగా చూశాడు. ఒక్క మాటేనా మాట్లాడలేదు. తంజావూరు మనిషి నాతో ఏమిసార్! సాపాటు చేసినారా?" అన్నాడు.

"లేదు. ఇంక వెళదాం" అన్నాను నేను.

"రాండి పోదాం" అన్నాడు అతను.

ముగ్గురం కలిసి భోజనానికి వెళ్లి మరొక ముప్పావు గంటకి తిరిగి వచ్చాము. రామచంద్రరావు "ఎస్ప్లనేడ్ వెళతానోయ్! అక్కడో అర్జంటు పని వుంది. మళ్లా రాత్రి భోజనం వేళకేగాని ఈ లోపల రాను బహుశా" అని, వాడి విషయమై జాగ్రత్త అన్నట్లు కన్ను గీటి వెళ్ళిపోయాడు. తంజావూరు పెద్దమనిషి కొంచెంసేపు వాకిట్లో తచ్చాడి గదిలోకి వచ్చి "నా పనిదా చూసుకోని మరి రెండు గంటల్లోదా వస్తాను సార్!" అని వెళ్లిపోయాడు. నేనూ పక్క పరుచుకుని, తలుపు గడియ వేసుకుని పడుకున్నాను.

సుమారు ఒంటి గంట అయింది. వీధి తలుపు తట్టినట్టుగా అనిపించింది. తంజావూరు మనిషే ఘట్టిగా తలుపు తట్టి నన్ను లేపించాడు. లోపలికి వచ్చి "రాండి సార్, కాఫీ హోటేలుకుదా పూడుద్దాం" అన్నాడు. నేను నిర్మొహమాటంగా "రాను" అన్నాను. అతను తెల్ల మొహంవేసి మళ్లా "రాండిసార్! ఇప్పుడే పూడ్చి వద్దాము" అన్నాడు. నేను "నాఖర్చు నేనూ మీఖర్చు మీరూ పెట్టుకునే పద్ధతి మీద అయితే వస్తాను లేకపోతే రాను" అని దృఢంగా అన్నాను.

"అలాగు కాదు సార్. మీరు నాకు యింత వుపకారందా చేస్తిరి. మీకు టిఫిన్‌దా యిప్పించకపోతే నాకు పాపం రాదు సార్!" అన్నాడు.

"ఈ కొస్తకూ పాపం ఏమిటి" అన్నాను నేను.

"అలాగు కాదు సార్. ఇప్పుడే పూడ్చివద్దాం. రాండి సార్!" అని బలవంత పెట్టాడు. నేను కొంచం మెత్తపడ్డాను. ఆపళంగా అతను మరింత పట్టుదలతో "మీరొస్తేనేగాని నేను ఇవాళ కాఫీదా బోంచేసేదే లేదు" అన్నాడు. ఈ పాపంకూడా నాకెందుకని మనస్సులో అనుకుని "వస్తానులెండి. కొంచెం కాలకృత్యం

తీర్చుకు వస్తాను'' అని చెప్పి ఒకమారు గదిలో వస్తువులన్నీ చూశాను. ఇంతకీ ఖరీదయిన వస్తువులు మా కోట్ల జేబుల్లోనూ చొక్కా జేబుల్లోనూ లేవు. రిస్టువాచీ చేతినే వుంది. కళ్లజోడు కళ్లనే వుంది. మేజాబల్లమీద పుస్తకాలూ, రెండు ఫౌంటెన్ కలాలూ వున్నాయి. మూల వున్న లాంతరు, కిరసనాయిలు డబ్బా ఎత్తుకు పోతాడా? లేక జోళ్లు ఎత్తుకు పోయే మాటుంటే ఒక అణా దక్షిణ కూడా ఇచ్చుకుంటాను. ఇంతకీ పోయే సామగ్రి లేదు. అంచేత ''ఇక్కడే కూచోండి. ఇప్పుడే వస్తా''నని చెప్పి వెళ్లి కొల్యం తీర్చుకుని, కొళాయి దగ్గిరే మొహం కడుక్కుని ఒక్క నాలుగు నిమిషాల్లో తిరిగి గదిలో పడ్డాను. మేజా బల్లమీద ఫౌంటెన్ కలాలు వున్నాయో లేదో చూశాను. ఎప్పటిలాగే వున్నాయి. వస్తువు లేమేనా చెదిరినట్టుగా వున్నాయేమో చూశాను. అన్నీ యథాస్థానాలలో వున్నాయి. ''పాపం మంచివాడే. కొత్తవాడని వూరికే అనుమాన పడ్డాను కాని'' అని మనస్సులో అనుకొని మొహం తుడుచుకొని గుడ్డలు వేసుకున్నాను. ఇద్దరం ట్రాంబండి యెక్కి కాఫీ హోటేలుకు వెళ్లాము. తినవలసినవన్నీ తంజావూరు స్నేహితుడే పురమాయించాడు. ఫలహార మయింది. నేను ఎంత బతిమాలుకున్నా నన్ను డబ్బు యియ్యనియ్యలేదు. తిండి ఖర్చంతా తనే చెల్లించుకున్నాడు. ఇద్దరం ట్రాం ఎక్కి తిరిగి గదికి వచ్చేశాము.

అతనూ నేనూ చాలాసేపు మాట్లాడుకున్నాము. ఆ సందర్భంలోనే అతను తాను వచ్చినపని పొద్దున్నే అయిపోయిందనీ, ఇంక సాయంత్రంవరకూ వుండ నవసరం లేదనీ, మరొక గంటలోనే బండికి వెళ్లిపోతానని చెప్పాడు. వచ్చినపని అయిందికదా అని నేనూ సంతోష పడ్డాను.

మూడు గంటలయింది. ప్రయాణానికి సిద్ధ పడ్డాడు. ఇంతకీ సిద్ధపడడమంటే ఏముంది? కాలికి జోళ్లు తొడుక్కోవడం, కోటు బుజాన్ని వేసుకోవడం, సూట్ కేస్ చేత పట్టుకుని పోవడం. అన్నీ అయి సూట్ కేస్ చేత పట్టుకున్నాడు. ''సెలవు సార్!'' అన్నాడు. ''మంచిది! మళ్లా ఈ వూరు ఏదేనా పనిమీద వస్తే తిన్నగా ఇక్కడికే రండి బసచేద్దురు గాని'' అని అన్నాను. ''వేరె చెప్పాలా సార్! నాకు అంతమాత్రండా తెలియదా సార్!'' అన్నాడు. మెట్లు దిగి వెళ్లిపోయాడు. ఎన్నాళ్లనుంచో ఎరిగిన నేస్తకాడు వెళ్లిపోయినట్టుగా నా మనస్సుకు అనిపించింది.

సాయంత్రం నాలుగు గంటలయింది. రామచంద్రరావు తిరిగి వచ్చాడు. ''ఏమోయ్! పెంద్రాడే వచ్చేశావు. రాత్రికి గాని రానన్నావుకదా'' అని అడిగాను. ''ఇంక ఎక్కువసేపు వుండ నవసరం లేకపోయింది; అందుచేత వచ్చేశాను'' అన్నాడు అతను. కోటు విప్పి, కాళ్లూ చేతులూ కడుక్కుని ''ఏడీ మీ స్నేహితుడు'' అన్నాడు రామచంద్రరావు.

''గంటకిందటే వెళ్లిపోయాడు'' అన్నాను నేను.

''దొంగ ముండాకొడుకు ఏమీ ఎత్తుకు పోలేదుకదా''

''నీ అనుమానాలన్నీ అలాగే వుంటాయి. వాడు చాలా పెద్దమనిషి.''

''పెద్దమనిషి అయితే మంచిదే. లేకపోతేనే—''.

''అబ్బే! వాణ్ణి మొదటినుంచీ కనిపడుతూ వుంటేనే.''

''సాయంత్రం వరకూ వుంటాడు అన్నావు కామోసు నువ్వు?''

''మొదట అలాగే చెప్పాడు వాడు. కాని వచ్చిన పని పొద్దున్నే అయిపోయిందిట. అంచేత వెళ్లిపోయాడు.''

''శనిగ్రహం వదిలిపోయాడు లే.''

''పాపం చాలా మంచివాడోయ్!''

''మంచివాడో చెడ్డవాడో వదిలిపోయాడు. తీరిపోయింది'' అతనికి ఏదో చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ''ఔనుగాని ఏమోయ్! మీ ఆవిడ పంపించిన పూలు మేజోళ్లు చూపిస్తానన్నావు. చూపించావే కాదుకదా'' అన్నాడు. నేను లేచి ''ఇప్పటివరకూ వీలు కుదరలేదు. ఇదిగో ఇప్పుడు తెస్తున్నా'' అని చెప్పి సూట్ కేస్ దగ్గరికి వెళ్లాను. వెళ్లి తాళం తియ్యబోయాను. తాళం బెట్టుగా వున్నట్టనిపించింది. ''ఏమి చెప్మా'' అని గట్టిగా తిప్పేను. తాళం వచ్చింది. మూత తీశాను. నా కళ్లను నేను నమ్మలేదు. అలాగే రెండు నిమిషాల సేపు చూశాను. ఒక పాత చొక్కా వుంది. దాని కింద ఇంత వట్టిగడ్డి వుంది. ''వేగిరం తీసుకురా'' అన్నాడు రామచంద్రరావు. నేను జవాబు చెప్పలేదు.

"ఏమోయ్ లేవేమి" అన్నాడు అతను. "ఇది నా పెట్టె కాదు. ఆ వెధవ మోసం చేశాడు. నా పెట్టె దొంగిలించుకుపోయి వాడి పెట్టె ఇక్కడ పారేసిపోయేడు" అని మాత వేశాను. అతను ఒక్క గంతులో నాదగ్గరికి వచ్చి, చూసి "ఇది నీ పెట్టె కాదంటా వేమిటోయ్" అన్నాడు ఆశ్చర్యంతో.

"ఔను పెట్టె అంతా నా పెట్టెమాదిరే. వాడి పెట్టె ఇక్కడ పారేసి నా పెట్టె పట్టుకుపోయాడు" అని జవాబు చెప్పాను నేను.

"వాడి పెట్టెకి పువ్వులగుడ్డ బురకా వుందికదా."

"ఔను! అది నా పెట్టెకి వేసి వాడి పెట్టె ఇక్కడ పారేసి నాది పట్టుకుపోయాడు."

"ఎంత మోసం చేశాడు. అయితే ఈ మోసం ఎప్పుడు జరిగిందంటావు?"

నేను కొంచెంసేపు ఆలోచించి "నేను గదిలో నిద్ర పోతూవుండగా వాడు వచ్చి నిద్ర లేపేడు. కాఫీ హోటేలుకు వెళదాం రమ్మన్నాడు. ఎలాగైతే నేం చివరికి నన్ను ఒప్పించాడు. నేను కాల్యం తీర్చుకోడానికీ, మొహం కడుక్కోడానికీ అవతలికి వెళ్లాను. అప్పుడు చేసివుంటాడు, ఈపని" అన్నాను నేను.

"ఔను! నిజమే!", కొంచెంసేపు వూరుకుని అతను "కాని నీ పెట్టెలాంటి పెట్టె వాడు ఎలాగ సంపాదించాడు?" అని అడిగాడు.

"ఏమో!"

"ఆ కిటికీ వెయ్యి అని మొదటినుంచీ నేను చెప్తూనే వున్నాను. నా మాట విన్నావు కాదు కదా" అన్నాడు విచారంగాను. నాకు ఏడుపు వచ్చింది. అతను ఎప్పుడూ కిటికీ తలుపులు వెయ్యమని పోరుతూనే వున్నాడు. నేనే వెర్రిగా నవ్వి వూరుకుంటూ వుండేవాణ్ణి. నా తెలివి తక్కువతనానికి తగిన ప్రాయశ్చిత్త మయింది.

"నీ మాట వినకపోడం వల్లే వచ్చింది ఇదంతా. ఈ గదిలో వస్తువులన్నీ ఆ కిటికీగుండా వాడు చూసి ఈ సూట్ కేస్ లాంటిది మరొకటి కొని దానికి బురకా వేసి పట్టుకొచ్చాడు."

"అంటే వాడు మనం గదిలో లేని సమయంలో ఇది వరకు కొన్ని సార్లు ఇక్కడికి వచ్చివున్నా డన్న మాట. అన్నీ పరీక్ష చేసి ఈ సూట్ కేస్ లాంటి సూట్ కేస్ కొని బురకా కప్పి తెచ్చి మనని మోసం చేసి పోయా డన్న మాట."

"అంతే."

"అరి వీడి దౌర్జన్యం మండా!......ఇంతకీ డబ్బు ఎంత పోయిందంటావు?"

"దేవుడి దయవల్ల దాంట్లో ఆట్టే లేదు. వచ్చిన డబ్బుల్లా ఎప్పటి కప్పుడే ఇయ్యవలసిన వాటి కన్నిటికీ ఇచ్చేస్తూ వుండడంవల్ల దాంట్లో రొక్కం ఏమీ లేదు. గుడ్డముక్కలే వున్నాయి. అంతా పాతిక రూపాయిలు ఖరీదు వుంటాయి. పాతిక రూపాయిలు వీడి యెదాన్ని పెట్టాను."

"అన్నీ బాగానే వున్నాయి కాని; లే. ఇంకా ఆలస్య మెందుకు? లే, పోలీసు రిపోర్టు ఇద్దాం."

కళ్ల నీళ్లు తుడుచుకుంటూ నేను లేచాను. కిటికీ తలుపు గట్టిగా వేశాను.

"ఇప్పటికేనా తెలిసిందే" అన్నాడు రామచంద్రరావు.

"ఇప్పటికీ తెలియకపోతే ఇంక గాడిదతో సమానం" అన్నాను నేను.

గది తలుపు తాళం వేసి ఇద్దరం కలిసి పోలీసు ఠాణాకి బయలుదేరాము.

మీకు కావలసిన నక్కని స్వదేశీ శిల్కు యుడుపులు, గుడ్డలు, పలువిధములైన చీరలు, జాకెట్టు గుడ్డలు మొదలగునవి,
కేశవరామ్ అండు కంపెని,
1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.